# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రభుత్వ పాఠశాలల్లో నూరు శాతం ప్రవేశాలపై విద్యా శాఖాధికారులు దృష్టి సారించాలని మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు.
- ❖ ప్రజా ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు.
- ❖ పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్ కు ఉజ్వల భవిష్యత్ ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.
- ❖ రాయలసీమలో రాగల 5 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 - 43 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదయ్యే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలుపుతామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అందుకు అనుగుణంగానే ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామన్నారు. విద్యా వ్యవస్థలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పనిచేసే అదనపు ప్రాజెక్ట్ సమన్వయకర్త ఏపీసీలు, డీఈవోలతో రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్‌పై అధికారులు దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో మారుతున్న ఆధునిక సాంకేతికత, అత్యుత్తమ గ్లోబల్ బోధనా పద్ధతులపై క్షేత్రస్థాయి అధ్యయనం కోసం రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా విదేశాలకు పంపుతున్నామని ఆయన వెల్లడించారు. విదేశీ పర్యటనల్లో భాగంగా అక్కడ వారు నిశితంగా గమనించిన అంతర్జాతీయ స్థాయి బోధనా నైపుణ్యాలను, వినూత్న విద్యా పద్ధతులను తిరిగి వచ్చి మన రాష్ట్రంలోని ప్రభుత్వ బడులలో సమర్థవంతంగా అమలు చేస్తారని తెలిపారు. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్ ను ప్రవేశపెట్టాలని మంత్రి నారా లోకేశ్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

====================

ప్రజా ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. బాపట్ల జిల్లాలో ఈరోజు పర్యటించిన ఆయన చీరాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సముదాయంలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకంలో భాగంగా 23 కోట్ల 75 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న అత్యాధునిక క్రిటికల్ కేర్ ఐసియు విభాగం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సర కాలంలోనే 15వ ఆర్థిక సంఘం నిధులు, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకాల కింద 1,200 కోట్ల రూపాయలతో 4,500 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణాలను పూర్తి చేసిందన్నారు. ఒక్క బాపట్ల జిలాల్లోనే 234 ఆరోగ్య మందిరాల నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వాసుపత్రులపై ప్రజల్లో విశ్వాశం పెరిగిందనడానికి ఔట్ పేషెంటింగ్ ఓపీ సేవలే తార్కాణమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

====================

స్వచ్ఛ భారత్ 2.0 కార్యక్రమాల అమలు తీరుపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన జాతీయ స్థాయి సదస్సుకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ హాజరయ్యారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఇతర రాష్ట్రాల మున్సిపల్ శాఖ మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. మంత్రి నారాయణతో పాటూ మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి తదితరులు ఆంధ్రప్రదేశ్ నుండి పాల్గొన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను అమలు చేస్తున్న విధానాలను మంత్రి నారాయణ సదస్సులో వివరించారు. అదే విధంగా ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు చేపట్టిన చర్యలను, రాష్ట్రాన్ని డంపింగ్ యార్డ్ రహితంగా మార్చేలా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లు నెలకొల్పుతున్న విధానాన్ని కూడా సదస్సులో పాల్గొన్న వారికి విశదీకరించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు.

విరామం

====================

రైతులకు అందాల్సిన ఎరువులను అక్రమంగా పక్కదారి పట్టించడం, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించడం, ఇతర ప్రాంతాలకు తరలింపు వంటి వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులకు సరైన సమయంలో ఎరువులు అందకుండా కొరత సృష్టించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, ఇతర ప్రాంతాలకు తరలించడకుండా నిలువరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల డీలర్లు, గోదాములు, రవాణా కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బ్లాక్ మార్కెట్, అనధికార విక్రయాలు, పరిశ్రమలకూ, ఇతర అవసరాలకు ఎరువుల మళ్లింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఒక పత్రికా ప్రకటనలో సూచించారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా కుప్పంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో సతీసమేతంగా ఈరోజు పాల్గొన్నారు. జాతర సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు, అధికారులు తీర్థప్రసాదాలను అందించారు. కుప్పం పర్యటన ముగించుకొని బెంగళూరుకు వెళ్లిన ముఖ్యమంత్రి అక్కడ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ సెంటర్ లో జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొంటారు.

=====================

పర్యాటకరంగంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలనే ఉద్దేశ్యంతో హాలిడే టూరిజంకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆ శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పర్యాటక అభివృద్ధిపై మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో విదేశీ పర్యాటక యాత్రలకు బదులుగా దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు "హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్" అనే కార్యక్రమాన్ని ఏడాది పాటు నిర్వహించనున్నామని ప్రకటించారు. రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ తమ సహకారాన్ని అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. డెస్టినేషన్ వెడ్డింగ్‌లను మన రాష్ట్రంలోనే నిర్వహించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో గండికోట, అరకు వ్యాలీ, విశాఖపట్నం, కోనసీమ ఇలా ఎన్నో ప్రకృతి అందాలతో అలరారే ప్రాంతాలు ఉన్నాయని మంత్రి గుర్తు చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ఆగ్నేయ అరేబియా సముద్రం నుండి లక్షద్వీప్, ఉత్తర కేరళం, దక్షిణ అంతర్గత కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మీదుగా మధ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఒక ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రలో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారులు తెలియజేశారు. మరోవైపు ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలలో రేపు వడగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. అదే విధంగా రాయలసీమలో రాగల 5 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 - 43 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదు అయ్యే అవకాశముందని తెలియజేశారు.

=====================

ఉపాధి నిమిత్తం గల్ఫ్ మొదలగు విదేశీ ప్రాంతాలకు వెళ్లే కార్మికుల సంక్షేమం కోసం ఒక సమగ్రమైన ఎన్నారై (NRI) విధానాన్ని రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి ఎన్నారై సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ఉత్తమ ఎన్నారై పద్ధతులు, సంక్షేమ కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు ఆ కమిటీ రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఈ క్రమంలోనే ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో తాడేపల్లిలోని ఏపీ ఎన్ఆర్టీ భవనంలో కమిటీ సభ్యులు ఈరోజు సమావేశమయ్యారు. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వలస కార్మికుల సమస్యలు, మోసపూరిత ఏజెంట్లపై తీసుకుంటున్న చట్టపరమైన చర్యల గురించి మంత్రితో పాటు ఏపీ ఎన్ఆర్టీ అధికారులను కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు.

=====================
=====================